క్లుప్తంగా

నగరంలో వీరహనుమాన్ శోభాయాత్ర



శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

ఖమ్మంగాంధీచౌక్: హనుమాన్ జయంతిని పురస్కరించుకొని విశ్వ హిందూ పరిషత్, బజరంగదళ్ సంయుక్త ఆధ్వర్యాన మంగళవారం సాయంత్రం నగరంలో వీరహనుమాన్ శోభాయాత్ర నిర్వహించారు. ఈమేరకు గాంధీచౌక్‌లోని భారీ హనుమాన్ విగ్రహం వద్ద, పక్కనే ఉన్న శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయంలో పూజలు చేసి శోభాయాత్ర కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆంజనేయుని జెండాలను చేతబూని డీజే సౌండ్ మధ్య కేరింతలు కొడుతూ గాంధీచౌక్ నుంచి పర్ణశాల రామాలయం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విశ్వ హిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు బోనాల రామకృష్ణ, వీహెచ్‌పీ, బజరంగదళ్ విభాగాల ప్రతినిధులు పి.బాలాజీ, బొడ్డు కృష్ణ, నేరెళ్ల శ్రీను, పసుమర్తి రవి, బోయినపల్లి చంద్రశేఖర్, కొణతం లక్ష్మీనారాయణ, అల్లిక అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ రికవరీ

ఖమ్మంఅర్బన్: నగరంలోని ఖానాపురం హవేలి పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను రికవరీ చేసి మంగళవారం స్టేషన్‌లో బాధితుడికి అందించినట్లు సీఐ భానుప్రకాష్ తెలిపారు. ఇటీవల అగ్రహారం గేటు ప్రాంతానికి చెందిన టి.రాజు తన యాపిల్ ఫోన్ పోగొట్టుకుని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఆ ఫోన్‌ను రాబట్టి బాధితుడుకి అప్పగించినట్లు సీఐ చెప్పారు.

ఎన్నికల నియమావళి పాటించాలి

కూసుమంచి: ప్రతి ఒక్కరూ ఎన్నికల నియమావళి పాటించాలని ఎస్‌ఐ కిరణ్‌కుమార్ తెలిపారు. మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల కోడ్ ఉన్నంత వరకు నిత్యం పర్యవేక్షణ ఉంటుందని, మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో 25 బెల్ట్‌షాపులపై అక్రమ మద్యం అమ్మకాలపై కేసులు పెట్టామన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు నేషనల్ హైవే రోడ్లపై రైతులు ధాన్యం, మిర్చి వంటి పంటలను ఆరబోయకూడదని, ఆదేశాలను ధిక్కరిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అలాగే మైనర్‌లకు వాహనాలు ఇవ్వరాదని, వేసవి సెలవుల దృష్ట్యా పిల్లలను బావులు, కాలువల వద్దకు పంపకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం ఆర్టీసీ డిపో పరిధిలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని టీఎస్‌ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ డిపో కార్యదర్శి బేతంపూడి బుచ్చిబాబు కోరారు. డిపో కార్మికుల సమస్యలను డిపో మేనేజర్ బి.శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లడంతోపాటు సూపరింటెండెంట్ జయరాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బుచ్చిబాబు మాట్లాడుతూ.. డ్రైవర్ చార్ట్ కౌన్సెలింగ్ వెంటనే నిర్వహించాలని, బుకింగ్ చార్ట్‌లో స్పేర్‌లో ఉన్న కండక్టర్లు, డ్రైవర్లకు సీనియార్టీ ప్రకారం డ్యూటీలు బుకింగ్ చేయాలన్నారు. క్యాష్ సెక్షన్‌లో ఏడీసీలకు సాఫ్ట్‌వేర్ మారిన సమయాల్లో శిక్షణ ఇవ్వాలని, గ్యారేజీలో సరిపైన మెటీరియల్స్ అందుబాటులో ఉంచాలని, మహిళా కార్మికులకు రాత్రి 8 గంటల లోపు విధులు ముగిసేలా డ్యూటీలు కేటాయించాలని తెలిపారు. అలాగే డ్రైవర్లు, కండక్టర్లకు ప్రతి నెలా మూడు రోజులు సెలవులు ఇవ్వాలని, 2013 పే స్కేల్స్ ఏరియర్స్ 50% బాండ్ డబ్బులను వెంటనే చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం రీజియన్ ప్రచార కార్యదర్శి జుజ్జుకూరి కిరణ్‌కుమార్, ఖమ్మం డిపో కోశాధికారి దామాల లాజర్, డిపో నాయకులు కే.పిచ్చయ్య, ఆర్.దుర్గారావు, ఎండీ.సలీం తదితరులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	ది ఫ్యామిలీ స్టార్
వినోద	(టిల్లు)2
సాయిరాం	గాడ్జిల్లా కాంగ్
ఆదిత్య	గీతాంజలి మళ్లీ వచ్చింది
శ్రీనివాస	మంజుమ్మల్ బాయ్స్

- ఖమ్మంగాంధీచౌక్

తొమ్మిదేళ్లుగా తిప్పలు..



తారువేయక కంకరతేలిన పాన్నేకల్ రోడ్డు

నిధులు లేక నిలిచిన పాన్నేకల్- ఇల్లెందు రూట్

- కంకర పోశారు.. తారు మరిచారు..
- దుమ్ముతో ఇబ్బంది పడుతున్న వాహనదారులు
- వాహనాలు కిందపడి గాయాలపాలైన పలువురు
- అదనపు నిధుల కోసం ఎదురుచూపులు
- పట్టించుకోని ఆర్‌అండ్‌బీ అధికారులు

కామేపల్లి: కొండ నాలుకకు మందు వేస్తే ఉన్న నాలుక ఊడినట్లు అన్న చందంగా ఉంది పాన్నేకల్ బీటీ రోడ్డు నిర్మాణ పనులు. పాన్నేకల్ నుంచి పుల్లూరు మీదుగా ఇల్లెందు వరకు సుమారుగా 24 కిలోమీటర్లు ఉన్న సింగిల్ బీటీ రోడ్డును వెడల్పు చేస్తూ డబుల్ బీటీ రోడ్డు నిర్మాణ పనులకు అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం తొమ్మిదేళ్ల క్రితం రూ.31 కోట్ల నిధులను మంజూరు చేసింది. దీంతో అప్పటి ప్రజాప్రతినిధులు రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన కూడా చేశారు. అయితే డబుల్ రోడ్డు నిర్మాణం జరిగితే గ్రామాభివృద్ధి చెందుతుందని, రవాణా సౌకర్యం మెరుగుపడుతుందని ఆయా గ్రామస్తులు సంతోషపడ్డారు. కానీ వారి కలలు కలలాగే మిగిలిపోయింది.

పాన్నేకల్ మీదుగా కారేపల్లి మండలం పుల్లూరు, కమలాపురం, గుబ్బతండా, మేకల తండా, గేటు కారేపల్లి, ఇల్లెందుకు నిత్యం వాహనాల రాకపోకలు సాగుతుంటాయి.

కిందపడుతున్న వాహనాలు..

వాహనాల రాకపోకలతో రోడ్డుపై కంకర తేలి వాహనదారులకు ఇబ్బందిగా మారింది. దీంతో ప్రయాణం నరకంగా మారింది. రాత్రి సమయాల్లో వాహనాలు అదుపుతప్పి పల్టీకొట్టిన ప్రమాదంలో ఎంతోమందికి గాయాలైన సంఘటనలు ఉన్నాయి. అయినా సమస్య పరిష్కారానికి మాత్రం ఒక్క అడుగు ముందుకు పడడం లేదు.

తొమ్మిదేళ్లుగా జాప్యం..

తొమ్మిదేళ్లయినా రోడ్డు నిర్మాణ పనులు మాత్రం పూర్తి కావడం లేదు. రోడ్డు నిర్మాణ పనులు దక్కించుకున్న సదరు కాంట్రాక్టర్ ఉన్న బీటీ రోడ్డును తొలగించి డబుల్ రోడ్డు నిర్మాణ పనుల్లో భాగంగా కంకర పోసి చదును చేశాడు. ఆ తర్వాత ఇల్లెందు నుంచి పుల్లూరు వరకు డబుల్ బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. పుల్లూరు నుంచి పాన్నేకల్ వరకు సుమారు 4 కిలోమీటర్ల మేర తారు పోయకుండా వదిలేశాడు.

ప్రత్యామ్నాయంగా ట్యాంకర్ నీరు..

కంకర, డస్ట్ కారణంగా వాహనాలు వెళ్తున్న క్రమంలో వెనుక లేస్తున్న దుమ్ముతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. తొమ్మిదేళ్లుగా ఇబ్బందులకు గురి అవుతున్నా.. ఆర్‌అండ్‌బీ అధికారులు మాత్రం ఏమాత్రం పట్టించుకోవడం లేదు. గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రజలకు ఇబ్బందులు లేకుండా పంచాయతీ అధికారులు అప్పుడప్పుడు ట్యాంకర్ ద్వారా నీటిని చల్లిస్తున్నారు. ఈ చర్య కేవలం కంటి తుడుపుగా మారింది. ఇప్పటికైనా అధికారులు చొరవ తీసుకుని మిగిలిన బీటీ రోడ్డు నిర్మాణ పనులను పూర్తి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కాంట్రాక్టర్, అధికారుల నిర్లక్ష్యమే..



పాన్నేకల్ బీటీ రోడ్డు నిర్మాణ పనులు ఆగడానికి కాంట్రాక్టర్, ఆర్‌అండ్‌బీ అధికారుల నిర్లక్ష్యమే కారణం. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా వ్యవహరించి పనులు పూర్తిచేయలేదు. దీంతో రోడ్డుపై కంకర తేలడంతో రాళ్లు తగులుతున్నాయి. ఇకనైనా రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయాలి. – గింజల నరసింహారెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు, పాన్నేకల్

తొమ్మిదేళ్లయినా పూర్తికాలేదు..



బీటీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించి తొమ్మిదేళ్లయినా పూర్తి కాలేదు. తారు వేయకపోవడంతో రోడ్డుపై పోసిన కంకర తేలి దుమ్ము లేచి ఇళ్లపై రావడంతో పాటు వాహనాలు వెళ్తున్న క్రమంలో రాళ్లు వచ్చి తగలడంతో చిన్నారులకు గాయాలు కూడా అయ్యాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలి. - వల్లభనేని అశోక్, పాన్నేకల్

ప్రతిపాదనలు పంపాం..

ఇల్లెందు నుంచి పాన్నేకల్ వరకు డబుల్ బీటీ రోడ్డు నిర్మాణానికి సుమారు రూ.31 కోట్లు నిధులు మంజూరయ్యాయి. కానీ నిధులు సరిపోకపోవడంతో సుమారు 4 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణ పనులు ఆగిపోయాయి. అదనపు నిధుల కోసం ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరుకాగానే రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేస్తాం. – జి.ప్రవీణ్, ఆర్‌అండ్‌బీ ఏఈ, ఏన్కూర్

కాంగ్రెస్ 'గ్యారంటీ'లు మోసపూరితం



మాట్లాడుతున్న నామ నాగేశ్వరరావు

నేలకొండపల్లి: కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలు మోసపూరితమేనని ఖమ్మం బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి నామ నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం రాత్రి మండల కేంద్రంలోని వాసవి భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ గత అసెంబ్లీ ఎన్నికలలో ఇచ్చిన హామీలు నేరవేర్చలేదని, గడిచిన నాలుగు నెలల్లో కాంగ్రెస్ ఏం చేసిందో ప్రజలు గమనించారని అన్నారు. అనంతరం రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ 12 మంది అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా కృషి చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధు, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ మరికంటి ధనలక్ష్మి, మాజీ ఎమ్మెల్యేలు కందాళ ఉపేందర్‌రెడ్డి, సండ్ర వెంకటవీరయ్య, డీసీఎంఎస్ డైరెక్టర్ నాగుబండి శ్రీనివాసరావు, బీఆర్‌ఎస్ నాయకులు బెల్లం వేణు, శాఖమూరి సతీష్, వెన్నబోయిన శ్రీనివాసరావు, గండు సతీష్, తదితరులు పాల్గొన్నారు.

ఓటర్లకు ఇబ్బందులు రానివ్వొద్దు..

నేలకొండపల్లి: ఓటర్లకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఎంపీడీఓ ఎం.యర్రయ్య అన్నారు. మండల కేంద్రంలోని పలు వార్డులను మంగళవారం పరిశీలించి తాగునీటి సమస్యలను అడిగి తెలుసుకున్న సందర్భంగా ఆయన మాట్లాడారు. అంతేకాక ప్రత్యామ్నాయ మార్గాలను పరిశీలించాలని సూచించారు. ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అనంతరం పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించి ఓటర్లకు కనీస సౌకర్యాలు కల్పించాలని, పాఠశాలలో మధ్యాహ్నం భోజనాన్ని పరిశీలించి నాణ్యమైన భోజనం అందించాలని ఆదేశించారు. నూరు శాతం ఓటింగ్‌కు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నేలకొండపల్లి మేజర్ పంచాయతీ కార్యదర్శి దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

నూరుశాతం ఓటింగ్ జరిగేలా చూడాలి

నేలకొండపల్లి: పార్లమెంట్ ఎన్నికల్లో నూరు శాతం పోలింగ్ జరిగేలా గ్రామ సమాఖ్యలు చూడాలని ఐకేపీ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్(డీపీఎం) పద్మావతి సూచించారు. నేలకొండపల్లి ఐకేపీ కార్యాలయంలో మంగళవారం గ్రామ సమాఖ్యలు, గ్రామదీపికలతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రతీ పంచాయతీ ఓటర్లందరూ ఓటు వేసేలా అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే వీఓలు, గ్రామదీపికలు రాజకీయాలకు దూరంగా ఉండాలని, ప్రచారంలో పాల్గొన్న, సభలు, సమావేశాలకు వెళ్లినా తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సీ-విజిల్ యాప్ గురించి తెలుసుకుని, ఎన్నికల నిబంధనలు కచ్చితంగా పాటించాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ ఎం.యర్రయ్య, ఐకేపీ ఏపీఎం అశోక్‌రాణి, సీసీ, గ్రామదీపికలు తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' కూలి రూ.600 ఇవ్వాలి



తిరుమలాయపాలెం: సూపరింటెండెంట్‌కు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

తిరుమలాయపాలెం/ఖమ్మంరూరల్: మండుతున్న ఎండల్లో ఉపాధి పనులు చేస్తున్న కూలీలకు రోజుకు రూ.600 కూలి ఇవ్వాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ అనుబంధ అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకుడు బందెల వెంకయ్య, ఏఐకేఎంఎస్ జిల్లా నాయకుడు తిమ్మిడి హన్మంతరావు, డిమాండ్ చేశారు. మంగళవారం ఉపాధి కూలీ సమస్యలు పరిష్కరించాలని తిరుమలాయపాలెంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సూపరింటెండెంట్ మహమ్మద్ నాసర్ అహ్మద్‌కు వినతిపత్రం అందజేసిన సందర్భంగా హన్మంతరావు, ఖమ్మంరూరల్ ఎంపీడీఓ కార్యాలయ అధికారి సుధాకర్‌రెడ్డికి వినతి పత్రం అందించిన సందర్భంగా వెంకయ్య మాట్లాడారు. ఉపాధి కూలీలకు గతంలో వేసవి భత్యం ఇచ్చేవారని, ఇప్పుడు అది ఇవ్వకపోవడంతో రోజుకు ఎంత కూలి వస్తుందో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. అలాగే ప్రతీ వారం పే స్లిప్పులు ఇవ్వాలని, పని సామగ్రిని ప్రభుత్వమే సమకూర్చాలని, పని ప్రదేశంలో టెంట్లు వేయడంతో పాటు 200 రోజులు పని దినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమాల్లో ఏఐకేఎంఎస్ తెలంగాణ రాష్ట్ర నాయకుడు బందెల వెంకయ్య, డివిజన్ అధ్యక్షుడు సోమనపల్లి వెంకటేశ్వర్లు, బానోతు శంకర్, మండల కార్యదర్శి రాయిండ్ల చిరంజీవి, సోమనపల్లి వెంకటేశ్వర్లు, ఈర్ల వెంకటఅప్పారావు, వీరదాసు వెంకన్న, దొడ్డ వెంకన్న, తోకల సీతారాములు, సోమనబోయిన మల్సూరు, లక్ష్మయ్య, బి.ఉపేందర్, దుబ్బాకుల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

దుస్తులు, నిత్యావసరాలు వితరణ



దుస్తులు, నిత్యావసరాలు అందిస్తున్న దృశ్యం

రఘునాథపాలెం: మండలంలోని వీవీపాలెంకు చెందిన శ్రీరామనేని వరలక్ష్మి 4వ వర్ధంతి సందర్భంగా మంగళవారం కుటుంబసభ్యులు గ్రామంలోని రెండు నిరుపేద కుటుంబాలకు దుస్తులు, నిత్యావసర సరుకులను అందించారు. పేదలకు తమ వంతు సహకారం అందించడంతో పాటు, మరోకరికి స్ఫూర్తిగా ఉండాలని రూ.10 వేల విలువైన దుస్తులు, నిత్యావసరాలు అందించినట్లు వరలక్ష్మి కుమారుడు రామారావు తెలిపారు. కుటుంబసభ్యులు వెంకట్‌పునిత్, సుహాసని పాల్గొన్నారు.

పోలీసులకు ఫిర్యాదు

కామేపల్లి: తనపై హత్యాయత్నానికి పాల్పడిన వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని బీఆర్‌ఎస్ నాయకుడు, మండల గౌడ సంఘం అధ్యక్షుడు ముత్యం రామకృష్ణ పోలీసులను కోరాడు. మంగళవారం తాళ్లగూడెంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. సోమవారం రాత్రి దుకాణంలో తాను నిద్రిస్తున్న సమయాన ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి తలుపు తట్టడంతో తాను బయటకు వస్తే కారంపొడి చల్లి దాడి చేసేందుకు యత్నించారన్నారు. వెంటనే తాను కేకలు వేయడంతో అక్కడి నుంచి దుండగులు జారుకున్నారని, తనకు ప్రాణహాని ఉందని స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపాడు. గ్రామంలోని సీపీఐకు చెందిన వారే ఈ ఘటనకు పాల్పడ్డారని ఆరోపించారు.

చెరువుకొమ్ముతండాలో పెద్దమ్మ తల్లి జాతర



పూజలో పాల్గొన్న యుగంధర్, తదితరులు

రఘునాథపాలెం: మండలంలోని చెరువుకొమ్ము తండాలో మంగళవారం పెద్దమ్మ తల్లి జాతర వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రతీ ఏడాది తరహాలోనే గ్రామస్తులు గుడి పూజారి ఆధ్వర్యాన జాతర వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకల్లో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తనయుడు యుగంధర్, కాంగ్రెస్ నాయకురాలు తారాదేవి తదితరులు పాల్గొన్నారు.

లారీని ఢీకొట్టిన బైక్

ఖమ్మంఅర్బన్: ఖమ్మంలోని ఎస్ఆర్ గార్డెన్స్ వద్ద మంగళవారం రాత్రి ఆగి ఉన్న లారీని వెనక నుంచి ద్విచక్ర వాహనదారులు ఢీకొట్టారు. ఈ ఘటనలో ఇద్దరికి గాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించారు. కాగా, క్షతగాత్రుల వివరాలు తెలియాల్సి ఉంది.

రాహుల్‌ను ప్రధాని చేయడమే లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

ఖమ్మంవన్‌టౌన్: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 5 లక్షల మెజారిటీ వచ్చేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డిభవన్‌లో నిర్వహించిన యూత్ కాంగ్రెస్ పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఫలితాల తీరునే యూత్ కాంగ్రెస్ నాయకుల సమన్వయంతో పనిచేసి ఖమ్మం కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిని గెలిపించుకోవాలన్నారు. డీసీసీ అధ్యక్షుడు దుర్గాప్రసాద్, నాయకుడు తుంబూరు దయాకర్‌రెడ్డిలు మాట్లాడుతూ.. రాహుల్ గాంధీని ప్రధాని చేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీ అమలుచేస్తున్న 5 గ్యారంటీలను గడపగడపకు తీసుకెళ్లి విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. యూత్ కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జ్ ఖలీద్ మహ్మద్ నాయకులకు దిశానిర్దేశం చేశారు. జిల్లా అధ్యక్షుడు యడ్లపల్లి సంతోష్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ ఆబీద్, కుక్కల నరేష్, గంగాధర్, అన్వేష్, సైదేశ్వర్‌రావు, సర్దార్‌బాబు, కొండూరి హృదయ్‌కిరణ్, నవీన్‌రెడ్డి, బొల్లం మహేష్, గడ్డం రాజశేఖర్, రమణ, హర్షనాయక్, రవి, రామకృష్ణ,అనిల్, యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పోరాట స్ఫూర్తికి చిహ్నం మేడే



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: మేడే స్ఫూర్తితో కార్మిక హక్కుల రక్షణకై పోరాడాలని ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో 138వ మేడే దినోత్సవ గోడ ప్రతులను స్థానిక ఏఐటీయూసీ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మేడే పోరాట స్ఫూర్తికి చిహ్నమని, పని గంటల తగ్గింపు కోసం మొదలైన పోరాటం అనేక ఉద్యమ పోరాట విజయాలను అందించిందన్నారు.కమ్యూనిస్టు నేత సింగారవెలిశెట్టి 1923లో ఎర్రజెండాను ఎగురవేసిన నాటి నుంచి అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసం, కార్మిక హక్కుల రక్షణ, సాధన కోసం ఎర్రజెండా నీడన ఏఐటీయూసీ పోరాడుతుందన్నారు. 180 దేశాలలో నిర్వహించుకునే మేడే ఉత్సవాలు కార్మిక హక్కుల రక్షణ దినోత్సవంగా పాటించాలన్నారు. అనంతరం మేడేకు సంబంధించిన గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి శింగు నర్సింహారావు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గాదె లక్ష్మీనారాయణ, తోట రామాంజనేయులు, నాయకులు రావి శివరామకృష్ణ, ఎండీ జాకీరుద్దీన, పేరబోయిన మోహన్‌రావు, మేకల రవి తదితరులు పాల్గొన్నారు.

బస్టాండ్‌లో వ్యాపారులు నిబంధనలు పాటించాలి

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం డిపో పరిధిలోని బస్టాండ్‌లో వ్యాపారాలు చేసే యజమానులు తప్పకుండా నిబంధనలు పాటించాలని, లేకపోతే వారి లైసెన్స్‌లు రద్దు చేస్తామని ఉమ్మడి ఖమ్మం జిల్లా రీజనల్ మేనేజర్ సీహెచ్.వెంకన్న హెచ్చరించారు. మంగళవారం ఖమ్మం డిపో పరిధిలోని బస్టాండ్లలో వ్యాపారాలు చేసే యజమానులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బస్టాండ్లలో విక్రయించే వస్తువుల నాణ్యత, ఎమ్మార్పీ ధరలపై ప్రయాణికుల నుంచి వచ్చే ఫిర్యాదులను వ్యాపారులకు తెలియజేశారు. ఇకనుంచి బస్టాండ్‌లో అధిక ధరలకు అమ్మినట్లయితే, సదరు బస్టాండ్ స్టేషన్ మేనేజర్‌కు ఫిర్యాదు చేయొచ్చని సూచించారు.

మామిడితోట వేలం రూ.1.12 లక్షలు

కూసుమంచి: మండలంలోని చేగొమ్మ ఉద్యాన నర్సరీలో గల మామిడితోట కాయలను ఉద్యానవన అధికారులు మంగళవారం వేలం వేశారు. దీంతో కూసుమంచికి చెందిన అబ్దుల్ వాజిద్ రూ.1.12 లక్షలకు పాట పాడి మామిడితోట కాయలను దక్కించుకున్నారు. అధికారులు రూ. 65లక్షలకు నిర్ణయించగా వ్యాపారులు పోటీ పడి పాట దక్కించుకున్నారు. కార్యక్రమంలో ఉద్యావన, పట్టుపరిశ్రమ అధికారి బీ.వీ.రమణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'కల్పన' ప్రోగ్రాంకు గురుకుల విద్యార్థినులు

ఖమ్మంరూరల్: మండలంలోని కోదాడ క్రాస్‌రోడ్‌లో గల గురుకుల డిగ్రీ కళాశాలకు చెందిన 12 మంది విద్యార్థినులు హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ ఆడిటోరియంలో జరుగుతున్న కల్పనా ప్రోగ్రాంలో పాల్గొన్నారని కళాశాల ప్రిన్సిపాల్ జి.ఝాన్సీరాణి మంగళవారం తెలిపారు. ఈ ప్రోగ్రాం ద్వారా టెక్నాలజీ ద్వారా దేశం ఏవిధంగా అభివృద్ధి సాధిస్తుందో పలు కంపెనీల ప్రతినిధులు వివరించినట్లు తెలిపారు. అనంతరం విద్యార్థినులకు కాన్ఫరెన్స్ సర్టిఫికెట్లు అందించారు. సాంఘిక సంక్షేమ సంక్షేమశాఖ అధికారులు అడిషనల్ సెక్రటరీ హనుమంతునాయక్, జీఎస్ నిరూప, ఓఎస్డీలు భాను, ప్రసాద్, యశోలత పాల్గొన్నారు.

మూడోసారి ప్రధాని మోదీనే..



మాట్లాడుతున్న కొండపల్లి శ్రీధర్‌రెడ్డి

ఖమ్మంరూరల్: దేశంలో బీజేపీ విజయదుందుభి మోగించి ప్రధానిగా మోదీ మూడోసారి కావడం ఖాయమని బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఏదులాపురంలో మంగళవారం జరిగిన ఆ పార్టీ పోలింగ్ బూత్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలోని గల్లీలో ఎవరున్నా ఢిల్లీలో మాత్రం నరేంద్రమోదీ మరోసారి ప్రధాని కావాలని ప్రజలు కోరుకుంటున్నారని పేర్కొన్నారు. ఖమ్మం పార్లమెంట్ నుంచి కూడా తాండ్రను గెలిపించడానికి నియోజకవర్గం ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ సమావేశంలో బీజేపీ నాయకులు కనకాల వెంకటరామయ్య, మేక సంతోష్‌రెడ్డి, మేకపాటి రాంబాబు, వెంకన్న, రామయ్య పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగించొద్దు



కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ తిరుపతిరెడ్డి

కామేపల్లి: గ్రామాల్లో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని సీఐ తిరుపతిరెడ్డి హెచ్చరించారు. మంగళవారం ఇటీవల పండితాపురం గ్రామంలో శాంతి భద్రతలు విఘాతం కలిగించిన ఇరువర్గాలకు చెందిన వారికి పోలీస్ స్టేషన్‌లో కౌన్సెలింగ్ ఇచ్చిన సందర్భంగా ఆయన మాట్లాడారు. భవిష్యత్తులో ఎలాంటి గొడవలు, ఘర్షణలు తలెత్తకుండా ఉండాలని, ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామంపై ప్రత్యేక నిఘా ఉంటుందని, ప్రజలు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా ఈశ్వర్



నియామకపత్రం అందుకుంటున్న ఈశ్వర్

ఖమ్మంవన్‌టౌన్: యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఖమ్మం రూరల్ మండలం మద్దులపల్లికి చెందిన అంబటి ఈశ్వర్ నియమితులయ్యారు. మంగళవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఈశ్వర్‌కు జిల్లా అధ్యక్షుడు యడ్లపల్లి సంతోష్ నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఈశ్వర్ మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని, యువత సమస్యలపై పోరాడుతానన్నారు. గ్రామస్తులు, నాయకులు ఈశ్వర్‌ను సత్కరించి అభినందించారు.

వేసవి సెలవులు వచ్చాయోచ్..!

పాఠశాలలకు బుధవారం నుంచి సెలవులు కావడంతో మంగళవారం మధ్యాహ్నం నుంచి విద్యార్థులు ఆనందంగా ఇంటి బాట పట్టారు. విద్యార్థులను తీసుకెళ్లేందుకు వారి తల్లిదండ్రులు హాస్టళ్ల వద్దకు రావడంతో తోటి స్నేహితులకు వీడ్కోలు పలుకుతూ వేసవి సెలవులను ఉత్సాహంగా గడపటానికి సామన్లతో ఇంటికి వెళ్లారు. దీంతో హాస్టలన్నీ బోసిపోయాయి. – సాక్షి నెట్‌వర్క్



నేలకొండపల్లి: ఇంటికి వెళ్తున్న గురుకుల విద్యార్థినులు



ఖమ్మంమయూరిసెంటర్: లగేజీతో వెళ్తున్న ప్రభుత్వ సంక్షేమ వసతిగృహం విద్యార్థులు